క్లుప్తంగా

దొంగ ఓట్ల కుంభకోణానికి పాల్పడిన బీజేపీ

కడప వైఎస్సార్ సర్కిల్: భారత ప్రజాస్వామ్యంలో దొంగ ఓట్ల కుంభకోణం వెలుగులోకి రావడంతో భారతీయ జనతా పార్టీ, ఆ పార్టీ నేత, ప్రధాని నరేంద్ర మోదీకి రాజకీయంగా మూడినట్లు స్పష్టమవుతోందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ ధ్వజమెత్తారు. సోమవారం నగరంలోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం, రాజకీయ భవిష్యత్తు, భారతీయ జనతా పార్టీ పరిస్థితి వెంటిలేటర్ పై కొనసాగుతోందన్నారు. దీంతో మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి షాక్‌కు గురై మతిభ్రమించి మాట్లాడుతున్నాడని ఆరోపించారు. కిరణ్ కుమార్ రెడ్డి రాజకీయ ఎదుగుదలకు మూల కారణమైన కాంగ్రెస్ పార్టీని, రాహుల్ గాంధీని విమర్శించే స్థాయి ఆయనకు లేదన్నారు. బీజేపీలో కిరణ్ కుమార్ రెడ్డి ఎక్కడ ఉన్నాడో, తన పరిస్థితి ఏంటో చూసుకోవాలని ఎద్దేవా చేశారు.

రాహుల్ గాంధీ అరెస్ట్ బాధాకరం

కడప వైఎస్సార్ సర్కిల్ : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిజంగానే ఎన్నికల కమిషన్ మీద, ప్రభుత్వం మీద ఆటం బాంబు వేశారని డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి పేర్కొన్నారు. సోమవారం నగరంలోని ఇందిరా భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ 2024 లోక్ సభ ఎన్నికల్లో, అనంతరం జరిగిన కొన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలు నిజంగానే ప్రజల ఆకాంక్షలకు అద్దం పట్టాయా అనే సందేహం అప్పుడే చాలామందికి వచ్చిందన్నారు. ఆ సందేహాలకు, అనుమానాలకు బలం చేకూర్చే విధంగా ఇప్పుడు రాహుల్ గాంధీ కర్నాటకలోని ఒక లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఒక అసెంబ్లీ సెగ్మెంట్‌లో జరిగిన ‘ఓట్ చోరీ’ గురించి అనేక సాక్ష్యాధారాలతో సహా ముందుకు వచ్చారన్నారు. ఆయన లేవనెత్తిన అంశాలకు బాధ్యతాయుతంగా సమాధానం చెప్పాలే కానీ ఈసీ తానే అధికార పక్షంలా రాజకీయంగా స్పందించడం హాస్యాస్పదమన్నారు. రాహుల్ గాంధీ అరెస్ట్ బాధాకరమన్నారు.

సహనాన్ని అలవరచుకోవాలి



డిగ్రీ పట్టాలతో విద్యార్థులు, అధ్యాపకులు

కడప ఎడ్యుకేషన్: విద్యార్థులు సమయపాలనతోపాటు సహనాన్ని అలవరచుకోవాలని కడప ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవీంద్రనాథ్ పేర్కొన్నారు. బుధవారం కడప రిమ్స్ రోడ్డులోని స్పిర్క్స్ ఎంసీఏ, ఎంబీఏ కళాశాలలో సెమిస్టర్ 4 పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ విద్యార్థులు అంకితభావంతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. కాలాను గుణంగా విద్యార్థులు సమయ పాలన, సహనాన్ని అలవరచుకోవాలన్నారు. కళాశాల అధినేత కె. నిర్మల పట్టాలు పొందే విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కళాశాల సంచాలకులు ఎంసీ రవీంద్ర మాట్లాడారు. అనంతరం ఎంసీఏ, ఎంబీఏ కోర్సులో కళాశాల స్థాయిలో టాపర్‌గా నిలిచిన విద్యార్థులకు గోల్డ్ మెడల్‌తోపాటు ప్రసంశాపత్రం, అలాగే 5 వేల రూపాయల చెక్కులను అందచేశారు. అనంతరం విద్యార్థులకు పాస్ సర్టిఫికెట్లను అందచేశారు.

కేఎస్ఆర్ఎం ఉన్నతికి కృషి చేస్తా



ప్రిన్సిపాల్ నాగేశ్వర్ ప్రసాద్‌ను అభినందిస్తున్న కళాశాల కరస్పాండెంట్, ఎండీ

కడప ఎడ్యుకేషన్: కేఎస్ఆర్ఎం కాలేజీని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లడానికి అన్ని వర్గాల సహకారంతో పాటుపడతానని కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన నాగేశ్వర్ ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం ఆయన కేఎస్ఆర్ఎం కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ కందుల రాజేశ్వరమ్మ, మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ మదన్‌మోహన్‌రెడ్డిలు ప్రిన్సిపాల్ బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ నాగేశ్వర్ ప్రసాద్‌ను అభినందించారు.

అంకిత భావానికి ప్రతి రూపం వీఎస్ఎస్ మూర్తి.....

కందుల శ్రీనివాస్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ వీఎస్ఎస్ మూర్తి జులై 31వ తేదీ పదవీ విరమణ చేశారన్నారు. సుమారు 35 సంవత్సరాల సుదీర్ఘకాలం విద్యాసేవలందించారన్నారు. ఆయన పదవీ విరమణ సభను సోమవారం కళాశాల ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి, కరస్పాండెంట్ కందుల రాజేశ్వరమ్మ, వైస్ ప్రిన్సిపాల్ నాగేంద్రప్రసాద్, వివిధ విభాగాల డీన్‌లు పాల్గొన్నారు.

పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల పోలింగ్ కోసం అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద నుంచి ఎన్నికలకు సంబంధించిన బ్యాలెట్ బాక్స్‌లు, సామగ్రిని ఆయా గ్రామాల పరిధిలో ఏర్పాటు చేసిన ఎన్నికల అధికారులకు అందజేశారు. రాగిమానుపల్లె, అచ్చివెల్లి, ఎర్రిపల్లె, ఎర్రబల్లె–1, ఎర్రబల్లె–2, ఇ.కొత్తపల్లె పంచాయతీలలో ఎన్నికలు నిర్వహించనున్నారు. పులివెందుల మండల పరిధిలోని ప్రజలు స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని అధికారులు సూచించారు.

–పులివెందుల టౌన్



బ్యాలెట్ బాక్స్‌ను తీసుకెళుతున్న ఎన్నికల సిబ్బంది



ఎన్నికల సామగ్రిని సరిచూసుకుంటున్న అధికారులు



ఎన్నికలకు సిద్ధమవుతున్న పోలీసులు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



రిలే నిరాహార దీక్షలు చేస్తున్న మున్సిపల్ కార్మికులు

కడప కార్పొరేషన్: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. సోమవారం దీక్షలను యూనియన్ నగర సహాయ కార్యదర్శి ఇ. ప్రకాష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు ఎస్. రవి, కె. శ్రీరాములు మాట్లాడుతూ కార్మికులకు వేతనాలు పెంచుతామన్న హామీ ఇంత వరకూ అమలు కాకపోవడం బాధాకరమన్నారు. కలెక్టర్ ఇచ్చిన ప్రొసీడింగ్స్ ప్రకారం అదనపు కార్మికులకు వేతనాలు పెంచాలని, రిటైర్ అయిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు.

అదనంగా తీసుకొన్న కోవిడ్ కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ దీక్షల్లో జిల్లా ఉపాధ్యక్షులు కె. తిరుపాల్, ఎస్. కిరణ్, టి. మస్తాన్, అశిబాబు, మణికంఠ, శంకర్‌నాయక్, మహేశ్వర నాయక్, మహేష్, శివ నాయక్, వెంకట రాముడు, లక్ష్మీనరసయ్య, నాగేష్, ఇషాక్, నరసింహ, పెంచలయ్య, నాగేంద్ర, ఏసన్న, ఎం. రాజు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మట్లి రాజుల కోటలో తిరంగా ర్యాలీ

సిద్దవటం : మండల కేంద్రమైన సిద్దవటంలో సోమవారం హర్‌ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ జిల్లా పురాతత్వ సర్వేక్షణ కన్జర్వేషన్ అసిస్టెంటు ధాకారెడ్డి ఆధ్వర్యంలో ఎంటీఎస్ స్వరూన్‌రామ్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోడీ పిలుపు మేరకు ఈనెల 2వ తేదీ నుంచి 15వ తేదీ వరకు హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. మండల కేంద్రంలో కూడా మట్లి రాజుల కోట నుంచి సిద్దవటం గ్రామ పురవీధుల్లో విద్యార్థులచే ర్యాలీ నిర్వహించామన్నారు. ర్యాలీలో భారతమతాకీ జై అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, సిద్దవటం కోట సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఎన్ఎంయూ నూతన కమిటీ ఎన్నిక

ప్రొద్దుటూరు : స్థానిక ఆర్టీసీ డిపో (ఏపీపీటీడీ) ఎన్ఎంయూఏ నూతన కమిటీ సభ్యులను సోమవారం అధికారులతో పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రొద్దుటూరు ఎన్ఎంయూఏ నూతన ప్రెసిడెంట్‌గా చంద్రహాస్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా టీఆర్‌జీ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అయ్యవారప్ప, వసంతరెడ్డి, చీఫ్ అడ్వైజర్లుగా వైఆర్‌కే రెడ్డి, ఎస్ఎస్ నారాయణ, గ్యారేజీ ప్రెసిడెంట్‌గా ఎన్‌సీ శేఖర్, వైస్ ప్రెసిడెంట్‌గా వెంకటయ్య, సెక్రటరీగా అశోక్, జాయింట్ సెక్రటరీగా కేఎఫ్ రామయ్య, అసిస్టెంట్ సెక్రటరీగా ఎంఆర్ రెడ్డి, పబ్లిసిటీ సెక్రటరీగా రాంబాబును ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులు డీఎం మల్లికార్జునరెడ్డి, గ్యారేజీ ఎంసీ రాజశేఖర్‌రెడ్డి వినతి పత్రాలను అందించారు.

ఆశా వర్కర్స్ మహాసభను జయప్రదం చేయండి

మైదుకూరు : ఆశా వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ నాయకులు పిలుపునిచ్చారు. మహాసభలకు సంబంధించిన కరపత్రాలను సోమవారం వారు మైదుకూరులో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశా వర్కర్స్ యూనియన్ 3వ రాష్ట్ర మహాసభలు ఆగస్టు 30, 31 తేదీలలో కడప నగరంలో జరుగనున్నాయని తెలిపారు. మహాసభలలో ఆశా వర్కర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను సమగ్రంగా చర్చించి వాటి పరిష్కారం కోసం ప్రణాళికను రూపొందించనున్నటు వివరించారు. నియోజకవర్గంలోని ఆశా వర్కర్లందరూ మహాసభల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సుభాషిణి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు గుంటి వేణుగోపాల్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి.శ్రీరాములు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పోతిరెడ్డి భాస్కర్, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షురాలు పీవీ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కోలాటం, గజ్జపూజ



కోలాట భజనలు చేస్తున్న విద్యార్థులు

సిద్దవటం : మండల కేంద్రమైన సిద్దవటం గాంధీ వీధిలో ఆదివారం రాత్రి కోలాటం గజ్జపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కోలాట భజనల గురువు సుబ్బారెడ్డి వద్ద రెండు నెలలుగా శిక్షణ పొందుతున్న వారు కోలాటాన్ని ప్రదర్శించారు. కోలాట ప్రదర్శనను చూడటానికి పెద్దసంఖ్యలో ప్రజలు పాల్గొని ఉర్రూతలూగారు. ప్రదర్శన ఆద్యంతం చూపరులను కట్టి పడేసింది. కాగా గ్రామపెద్దలు లైటింగ్, సెట్టింగ్‌లను అందించి సహకరించారు.

ఉధృతంగా మల్లవంక



చాపాడు: మండల వ్యాప్తంగా ఆదివారం సాయంత్రం సోమవారం తెల్లవారుజాము వరకూ 44.8 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. ఈ వర్షానికి మండలంలోని గుంతచీపాడు వద్ద మల్లవంక ఉధృతంగా ప్రవహించింది. వంతెనపై వర్షపు నీరు మీటరు ఎత్తు వరకూ పారుతుండడంతో గుంతచీపాడు మీదుగా చాపాడుకు రాకపోకలు నిలిచాయి. దీంతో ఆయా గ్రామస్తులు 10 కి.మీ దూరం తిరుక్కుని చాపాడుకు వెళ్లాల్సిన పరిస్థితి తలెత్తింది. ఈ వంక పరీవాహంలోని పంట పొలాలు సాగు చేసుకున్న రైతులు తమ పంట పొలాలు ఎక్కడ మునిగిపోతాయోనని ఆందోళన చెందారు. అలాగే మండలంలోని అన్నవరం, సీతారామాపురం గ్రామాల వద్ద కుందూనదిలో వరద నీరు వంతెనకు తాకుతూ ప్రవహిస్తోంది.

కమలాపురం మున్సిపల్ కమిషనర్‌గా ప్రహ్లాద

కమలాపురం: కమలాపురం మున్సిపల్ కమిషనర్‌గా బి. ప్రహ్లాద బాధ్యతలు చేపట్టారు. కదిరి మున్సిపాలిటీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై కమలాపురం మున్సిపల్ కమిషనర్‌గా వచ్చారు. సోమవారం బాధ్యతలు చేపట్టిన ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేస్తానన్నారు. ఇంటి, నీటి పన్నులు సకాలంలో చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు. కాగా ఇక్కడ కమిషనర్‌గా పని చేస్తున్న పగడాల జగన్నాథ్ జూన్ 13న మడకశిర కమిషనర్‌గా బదిలీపై వెళ్లారు.

ప్రమాణ స్వీకారం

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు శ్రీపట్టాభిరామ హోల్‌సేల్ మండీ మర్చంట్స్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం సోమవారం పట్టాభి సీతారామాలయంలో జరిగింది. ప్రెసిడెంట్‌గా వరుసగా ఐదో మారు ప్రొద్దుటూరు రోషన్‌ను ఎన్నికయ్యారు. ప్రెసిడెంట్‌గా ప్రొద్దుటూరు రోషన్, వైస్ ప్రెసిడెంట్లుగా చెన్నూరు మోహన్ రెడ్డి, ఎంసీ దస్తగిరి యాదవ్, కార్యదర్శిగా వి.రామకృష్ణారెడ్డి, కోశాధికారిగా వేంపల్లి రవీంద్రనాథ్ రెడ్డి, సహాయ కార్యదర్శిగా బైసాని శ్రీనివాసులుతోపాటు ఈసీ మెంబర్లుగా వేల్పుల బాలకృష్ణయ్య యాదవ్, వేంపల్లి కృష్ణారెడ్డి, గురివిరెడ్డి, ఎంవీ వీరభద్రయ్య, మేడా సతీష్ బాబులు ప్రమాణ స్వీకారం చేశారు.

నల్లబాడ్జీలతో అధ్యాపకుల నిరసన

కడప ఎడ్యుకేషన్: డిగ్రీ కళాశాలలలో పనిచేస్తున్న అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని జీసీజీటీఏ జిల్లా అధ్యక్షుడు మధుసూదన, జిల్లా కార్యదర్శి కెయస్ సుందరేశ్వరరావు, జీసీటీఏ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరెడ్డిలు డిమాండ్ చేశారు. సోమవారం కడప ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ లెక్చరర్ల జేఏసీ అధ్యాపకుల సంఘం నాయకులు ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసిస్తూ నల్లబాడ్జిలతో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. దీంతోపాటు నల్లబాడ్జీలను ధరించి విధులకు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ గత నాలుగైదు నెలల నుంచి సాధారణ బదిలీలను నిర్వహించడం లేదన్నారు. దీంతోపాటు అర్హత కలిగిన బోధన, బోధనేతర సిబ్బందికి పదోన్నతులు కల్పించాలన్నారు. వీటితోపాటు పలు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులు త్వరగా స్పందించి సమస్యల పరిష్కారం కోసం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీసీజీటీఏ, జీసీటీఏ నాయకులు, లెక్చరర్లు పాల్గొన్నారు.



కడప ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో నల్లబాడ్జీలతో నిరసన తెలుపుతున్న లెక్చరర్లు

సాయినగర్‌లో వసతులు కల్పించండి



బురదమయంగా ఉన్న వీధులు



సిమెంట్ రోడ్డుకు నోచుకొని వీధులు

కడప వైఎస్సార్ సర్కిల్: నగర శివార్లలోని 45వ డివిజన్ సాయి నగర్‌లోని వీధులు సిమెంట్ రోడ్లకు నోచుకోకపోవడంతో చినుకు పడితే చిత్తడిగా మారుతున్నాయి. సాయి నగర్‌లోని వీధుల్లో సరైన మురికి కాల్వలు రోడ్లు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడిన సమయంలో వర్షపు నీరు వీధుల్లో నిల్వడంతో ప్రజలు నడవాటానికి సైతం ఇబ్బందులు పడుతున్నారు. సాయి నగర్ ప్రాంతంలో సిమెంట్ రోడ్లు, మురికి కాల్వలు నిర్మించాలని పలుమార్లు నగర పాలక సంస్థ అధికారులకు విన్నవించిన ఎటువంటి ఫలితం లేదని స్థానిక ప్రజలు కోరుతున్నారు. వర్షపు నీరు వీధుల్లో నిల్వడంతో రాత్రి సమయాల్లో ప్రజలు నడవాలంటే ఆగచాట్లు పడుతున్నారు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు స్పందించి సాయి నగర్ వీధుల్లో సిమెంట్ రోడ్డు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

రసవత్తరంగా విద్యుత్ ఉద్యోగుల క్రీడాపోటీలు

కడప కార్పొరేషన్: ఏపీ ట్రాన్స్ కో ఉద్యోగులకు జరుగుతున్న క్రీడా పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. పీవీఆర్ బ్యాడ్మింటన్ అకాడమీలో ఈ పోటీలు నిర్వహించారు. షటిల్ డబుల్ ఫైనల్స్‌లో గోవిందరాజు, లోకేష్ గెలుపొందగా, దుర్గాప్రసాద్, నవీన్ రన్నర్స్‌గా నిలిచారు. మహిళల షటిల్ డబుల్స్ ఫైనల్స్‌లో మౌనిక, కీర్తన గెలుపొందగా, సుబ్బలక్ష్మి, చందన రన్నర్స్‌గా నిలిచారు. 50 ఏళ్లు పైబడిన ఉద్యోగుల పోటీల్లో హెచ్. గంగన్న, క్రిష్ణ గెలుపొందారు. షటిల్ సింగిల్స్‌లో మౌనిక విజ యం సాధించారు. విజేతలను ఏపీ ట్రాన్స్ కో చీఫ్ ఇంజనీర్ క్రిష్ణ కుమార్, కో ఆర్డినేటర్ వెంకట సుబ్బయ్య, స్పోర్ట్స్ సెక్రటరీ మస్తాన్, వీరాంజనేయులు అభినందించారు. కల్చరల్ సెక్రటరీ వీరభద్రయ్య పాటలతో అలరించారు.



షటిల్ బ్యాడ్మింటన్‌లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు